సాక్షి
తూర్పుగోదావరి

గురువారం | 2 | మే | 2024



నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు వేగేశ్న సూర్యనారాయణరాజు, సీతమ్మ దంపతులు (ఆకివీడు) బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు.



4,650 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 500, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 7.55 అడుగుల నీటిమట్టం ఉంది.

గరిష్టం/కనిష్టం
43.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	43.0	28.0
కాకినాడ	32.5	25.0
అమలాపురం	39.0	26.0

చౌకర్యంగా సరకులు

- నాడు రేషన్ తీసుకోవడానికి అష్టకష్టాలు
- నేడు ఇంటింటికీ సరఫరా
- జిల్లా వ్యాప్తంగా 364 డోర్ డెలివరీ వాహనాల ఏర్పాటు
- 60 శాతం సబ్సిడీపై వాహనాలు అందజేత
- రేషన్ పంపిణీ ద్వారా వాహనదారుడికీ ఉపాధి అవకాశం
- జిల్లాలో 15,68,969 మందికి లబ్ధి
- వాహన మిత్ర ద్వారా ఒక్కో ఎండీయూ ఆపరేటర్‌కు సాయం



కొవ్వూరులో ఇళ్ల చెంతనే సరఫరా చేస్తున్న రేషన్ సరకులు (ఫైల్)

కొవ్వూరు: జిల్లాలో టీడీపీ పాలనలో రేషన్ సరకుల కోసం జనాలు అష్టకష్టాలు పడేవారు. రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. పనులు మానుకుని ఉదయం, సాయంత్రం నాలుగైదు సార్లు తిరిగితే తప్ప అన్నీ సరకులు అందని పరిస్థితి ఉండేది. చౌక దుకాణాల వద్ద గంటల తరబడి క్యూ లలో నిరీక్షించాల్సిన పరిస్థితులు ఉండేవి. కొన్నిచోట్ల రేషన్ కోసం రెండు,మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే దుకాణానికి వెళ్లాల్సి వచ్చేది. సర్వర్ డౌన్ అని చెప్పి పలుమార్లు వెనక్కి పంపేసేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. రేషన్ సరకుల కోసం ఏ పేదవాడు ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా నేరుగా డోర్ డెలివరీ విధానాన్ని అమలులోకి తెచ్చారు. ప్రజల చెంతకే రేషన్ సరకులు ఇచ్చే వ్యాను వెళుతోంది. ముందుగానే వలంటీర్ ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సమాచారం అందిస్తున్నారు. వీధిలోకి రాగానే వ్యాన్ సైరన్ మోగిస్తున్నారు. లబ్ధిదారులు ఇళ్ల నుంచి బయటికి వచ్చి సరకులు తీసుకుంటున్నారు. ఇదే రేషన్ సరకుల కోసం టీడీపీ పాలనలో జనం అష్టకష్టాలు పడ్డారు. సంక్రాంతి, రంజాన్ వంటి పండగల సమయంలో కానుకల పేరుతో టీడీపీ ఇచ్చే కొద్దిపాటి సరకులు కోసం జనం గంటల తరబడి బారులు తీరి నిలబడాల్సిన పరిస్థితి ఉండేది. అప్పట్లో మేజర్ పంచాయతీ అయిన దొమ్మేరు గ్రామం అంతటికీ 2,893 రేషన్ కార్డులకు ఒకే చౌక దుకాణం ఉండేది. దీంతో ఈ గ్రామస్తులు సరకుల కోసం రోజుల తరబడి క్యూ లో నిలబడాల్సిన వచ్చేది. ప్రజలు ఆందోళనకు దిగడంతో ఈ దుకాణాన్ని విభజించి నాలుగు రేషన్ షాపులుగా ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో జిల్లా అంతటా ఎక్కడ చూసినా ఇదే రకమైన పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు వైఎస్సా ర్ సీపీ ప్రభుత్వంలో పరిస్థితి మారింది. డోర్ డెలివరీ విధానం ద్వారా రేషన్ సరకులు ఇళ్లకే పంపిస్తున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందుల్లేకుండా వ్యాన్ ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులు తీసుకొచ్చి అందించారు. వలంటీర్‌లు నేరుగా సరకులు తీసుకుని ఇంటింటి అందించి ప్రజల మన్ననలు పొందారు. అటువంటి భయకరమైన పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన డోర్ డెలివరీ విధానం ఎంతో ఉపకరించింది.



టీడీపీ హయాంలో కొవ్వూరు మసీదు వీధిలో రేషన్ సరకుల కోసం బారులు తీరిన జనం (ఫైల్)

జిల్లాలో ఇలా....

మొత్తం రేషన్ కార్డుల సంఖ్య:
5,73,197

జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య :
15,68,969

రేషన్ సరఫరా చేసే వాహనాల సంఖ్య:
364

జిల్లాలో 364 డోర్ డెలివరీ వ్యాన్‌ల ఏర్పాటు

జిల్లావ్యాప్తంగా 5,73,197 రేషన్ కార్డులున్నాయి. వీటి పరిధిలో 15,68,969 మంది లబ్ధిదారులున్నారు. చౌక దుకాణాల డీలర్లకు కమీషన్ చెల్లిస్తూ వారి ఉపాధికి భంగం లేకుండా డోర్ డెలివరీ విధానం ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో రేషన్ సరుకులు అందించేందుకు 364 వ్యాన్‌లు ఏర్పాటు చేశారు. వాహనదారుడే రేషన్ అందించేటట్లు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారు. ఆటో కొనుగోలుకు అయ్యే ఖర్చులో 60 శాతం ప్రభుత్వ సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం, పదిశాతం లబ్ధిదారుడి వాటాగా అందించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.5,81,190గా నిర్ధారించారు. జిల్లావ్యాప్తంగా రూ.21.15 కోట్ల విలువైన వాహనాలను లబ్ధిదారులకు అందించారు. బ్యాంకు రుణం 30 శాతం చెల్లిస్తే తిరిగి వాహనాలు లబ్ధిదారుడికే ఉండేటట్టు చర్యలు తీసుకున్నారు. తద్వారా ఆటో, వ్యాన్ ఆపరేటర్‌కి ఉపాధి కల్పించారు. ఇందుకోసం ఎండీయూ(మొబైల్ డిస్‌పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్‌కి నెలకి రూ.18 వేలు చొప్పున జీతం అందిస్తున్నారు. అవసరమైతే ఆ మొత్తంలో మరొక హెల్పర్‌ను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వ్యాన్ ద్వారా ఆయా వీధుల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి సరకులు అందిస్తున్నారు. వాహనమిత్ర పథకం ద్వారా ఎండీ యూ ఆపరేటర్లకు రూ.10 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది.

డోర్ డెలివరీ విధానం సౌలభ్యంగా ఉంది



డోర్ డెలివరీ విధానంలో రేషన్ సరకులు సరఫరా చేసే తేదీని వలంటీర్ ద్వారా ముందుగా తెలియజేస్తున్నారు. తద్వారా పనులు మానుకోవాల్సిన అవసరం లేదు. రేషన్ తీసుకోవడం కోసం టీడీపీ హయాంలో పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉండేది. నాలుగైదు సార్లు రేషన్ సరకులు కోసం తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటింటికీ రేషన్ సరకులు అందించడం సంతోషంగా ఉంది.

– తైలం సత్యనారాయణ, లబ్ధిదారుడు, వేగేశ్వరపురం

ఎంతో ఉపయోగం



రేషన్ సరకులు డోర్ డెలివరీ చేయడం సౌకర్యంగా ఉంది. గతంలో రేషన్ షాపునకు వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటి దగ్గరకే సరకులు తెచ్చి ఇస్తున్నారు. సరకులు ఏ రోజున అందిస్తారో ముందుగా వలంటీర్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. పెద్ద వయసు వాళ్లు, లేవలేని స్థితి ఉన్న వాళ్లకు సైతం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

–గుర్రాల మంగ, గృహిణి, కొవ్వూరు



ఎండీయూ వాహనం ద్వారా సరకుల పంపిణీ

న్యూస్‌రీల్

ఇంటి వద్ద పింఛన్ల పంపిణీ 77.99 శాతం పూర్తి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో బుధవారం పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్ద సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేసే పింఛన్లు పంపిణీ రాత్రి 7.00గంటలవరకు 77.99శాతం పూర్తయింది. జిల్లాలో 2,43,077మంది పింఛన్‌దారులకు గాను రూ.72.16కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అనారోగ్యంతో మంచం మీద ఉన్న వారికి, దివ్యాంగులకు, అమర జవాన్ల భార్యలకు మాత్రమే ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ సొమ్ము పంపిణీ చేసింది. సచివాలయ ఉద్యోగులు పింఛన్ సొమ్మును గురువారం కూడా పంపిణీ చేయనున్నారు.

మిగిలిన లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లోనే...

జిల్లాలో మిగిలిన 1,78,086 మంది లబ్ధిదారులకు ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు డీబీటీ ద్వారా జమ చేస్తున్నారు. కొంతమందికి రూ.3వేలు జమ అయినట్లు మేసేజీలు వచ్చాయి. కొంతమందికి మేసెజీలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆధార్‌తో అనుసంధానంతో ఉన్న బ్యాంకుఖాతాకు రూ.3వేలునగదు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు. గురువారం నుంచి పింఛన్ లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పింఛన్లు తీసుకునేందుకు డీఆర్‌డీఏ–క్రాంతిపథం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 525కు పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌మీడియెట్ ఉచిత విద్య అందిస్తున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మధుసూదన్ బుధవారం కాకినాడలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్పృహ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ ట్రస్ట్ ద్వారా ఈ నెల 5వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి, ఈ నెలలో రాజమహేంద్రవరంలో రాత పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారికి వారు కోరుకున్న ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీ లేదా బైపీసీ అడ్మిషన్‌కు ఫీజు చెల్లిస్తామన్నారు. పాత ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులని, ఇతర వివరాలకు 99595 07507 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా ఇన్‌చార్జి ఎం.కూర్మారావు, ఇంటర్నేషనల్ పీస్ కమిటీ సభ్యులు యాంటోనీ గాడ్విన్, గీతం స్కూల్ డైరెక్టర్ సుజ్ఞాన్ పాల్గొన్నారు.

వడగాడ్పుల హెచ్చరిక

కాకినాడ సిటీ: ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల ప్రకారం గురువారం కాకినాడ జిల్లాలోని 13 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ జె.నివాస్ విలేకర్లకు తెలిపారు. గండేపల్లి, గొల్లప్రోలు, జగ్గంపేట, కిర్లంపూడి, కోటనందూరు, పెదపూడి, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, రౌతులపూడి, సామర్లకోట, శంఖవరం, ఏలేశ్వరం మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం కాకినాడ జిల్లాలో తుని మండలంలో 41.9 డిగ్రీల సెంటీగ్రేడు అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నివాస్ సూచించారు.

కూటమి కుట్రను ఓటుతో ఎదుర్కొందాం



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, ముస్లిం, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం నుంచి పుట్టిన ఎన్‌డీఏ కూటమి కుట్రను ఓటు అనే ఆయుధంతో ఎదుర్కొందామని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన బుధవారం అమలాపురంలోని గ్రాండ్ హోటల్‌లో ముస్లిం, క్రైస్తవ సంఘాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దేశంలో ముస్లింలు, క్రైస్తవులపై జరుగుతున్న హింసను వారందరూ వ్యతిరేకించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి కుట్రను ముస్లింలు, క్రైస్తవులు తమకున్న ఓటు అనే ఆయుధంతో ఎదుర్కోవాలన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును గెలిపిస్తే మనకు మనమే శిక్ష వేసుకున్నట్లేనన్నారు. ముస్లింలు, క్రైస్తవులు తమ హితులకు, బంధువులకు కూటమి కుట్ర సమాచారాన్ని పంపించి అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు హోషయాన్, బిషప్ జార్జి పాపఫ్, గ్రాబియేల్, ముస్లిం ప్రతినిధు లు ఇక్బాల్, హఫీజ్, కర్రార్ హుస్సేన్, ఖ్వాజా బాబు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారా వు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి గీత తమ అభిప్రాయాలను తెలిపారు.

పారదర్శకంగా ఈవీఎంల ర్యాండమైజేషన్

- హాజరైన సాధారణ పరిశీలకులు, అభ్యర్థులు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోటీలో నిలిచిన అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో 'ఈవీఎం ర్యాండమైజేషన్' ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజమహేంద్రవరం పార్లమెంటు, రాజమండ్రీ రూరల్, రాజానగరం నియోజకవర్గం, అనపర్తి , రాజమండ్రీ సిటీ, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల ఈవీఎంల ర్యాండమైజేషన్ ఆయా అభ్యర్థుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంటు, రాజమండ్రి రూరల్, రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం యూనిట్‌లను కలక్టరేట్‌లో ర్యాండమైజేషన్ చేశామన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా ఇది జరిపామన్నారు. అనంతరం నియోజకవర్గాల వారీగా ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల సమక్షంలో ఎన్ని రౌండ్ల ర్యాండమైజేషన్ చెయ్యాలో అడిగి ఆ మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 1,577 పోలింగు కేంద్రాలకు ఈవీఎంల కేటాయించామన్నారు. బ్యాలెట్ , కంట్రోల్ యూనిట్స్ 20 శాతం అధికంగా, వివి పాట్స్ 30 శాతం అధికంగా కేటాయించామన్నారు. వాటి వివరాలు ఆయా అభ్యర్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.బాల సుబ్రహ్మణ్యం, కమల్ కాంత్ సరోఛ్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి పాల్గొన్నారు.

హోం ఓటింగుకు సన్నద్ధం

ఎన్నికల ప్రక్రియ లో కీలకమైన చర్యలు తీసుకోవడంలో భాగంగా 1,306 మంది మే 2వ తేదీన ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేలా కార్యాచరణ సిద్ధం చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. జిల్లాలో మే 2, మే 8వ తేదీలలో హోం ఓటింగు కోసం రిటర్నింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశామన్నారు. అందులో భాగంగా 85 ప్లస్ కేటగిరిలో 648, పీడబ్ల్యూడీ కేటగిరిలో 658 మందికి ఫారం 12 డి అందజేసినట్లు తెలిపారు. హోం ఓటింగు ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 69 రూట్ల ద్వారా ఆయా ఎన్నికల సిబ్బంది తొలి విడతగా మే 2 వ తేదీన, మిగిలిన వారికి రెండో విడతగా మే 8 వ తేదీన ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒక వేళ రెండు సందర్భాలలో ఓటు హక్కును వినియోగించుకోలేకపోతే మే 13వ తేదీన ఓటు వేసే అవకాశం ఉండదని తెలియ చేశారు.

చంద్రబాబు నోరువిప్పితే అబద్ధాలే..

- నమ్మితే నట్టేట ముంచేస్తాడు
- 2014 మేనిఫెస్టోలో ఒక్క హామీ అమలు చేయలేదు
- ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు హామీల ఎర
- రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జగనన్నను ఆశీర్వదించండి
- వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధి
- విలేకరుల సమావేశంలో ఎంపీ మార్గాని భరత్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నోరు విప్పితే అన్నీ అబద్ధాలేనని రాజమండ్రి ఎంపీ, సిటీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ విమర్శించారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు వచ్చాయంటే ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా వల్లిస్తారన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వరాలు ఇవ్వడం, గెలిచాక వాటిని విస్మరించడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్యన్నారు. అందుకే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చంద్రబాబును ఉద్దేశించి 'ఆల్ ఫ్రీ బాబు' అనేవారని గుర్తుచేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న వాటిలో ఏ ఒక్కటీ అమలు చేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. ప్రస్తుతం బాబు విడుదల చేసిన మేనిఫెస్టో చూస్తే ఏ ఒక్కటీ అమలు చేయరన్న సంగతి ప్రజలకు అర్థం అవుతుందని చెప్పారు. హామీలు ఇచ్చి గద్దెనెక్కడం, ఎక్కాక ప్రజలను కరివేపాకులా తీసి పారేయడం బాబుకు అలవాటేనన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో రైతు, డ్వాక్రా, చేనేత రుణాలు ఎక్కడ మాఫీ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో సహజంగానే యువత నమ్మి ఎంతో ఆశతో టీడీపీని గెలిపిస్తే తీరా సీఎంగా పదవిలోకి వచ్చాక నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు. పోలవరం నిర్మాణంలో అన్నీ లోపాలే.. ప్రధాని నరేంద్ర మోదీనే చంద్రబాబుకు పోలవరం ఒక ఏటీఎంలా వాడుకుంటున్నారని ఆరోపించిన విషయం ఏపీ రాష్ట్ర ప్రజలందరికీ గుర్తేనన్నారు. ఇన్ని అబద్ధాలు, ఇన్ని మోసాలు చేసి, స్కీమ్‌ల పేరుతో భారీ స్కామ్‌లు చేసిన చంద్రబాబును, ఆయన మాటలు, ఆయన విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు పూర్తిగా నమ్మడం లేదన్నారు. 2018లో ఎన్డీఏతో విభేదించి బయటకు వచ్చిన చంద్రబాబు ప్రధాని మోదీ, అమిత్ షాపై ఎన్ని విమర్శలు, దుర్భాషలు, అవమానించే ఘటనలకు పాల్పడ్డారో అందరికీ తెలుసన్నారు. ఇవన్నీ చంద్రబాబు మర్చిపోయినా బీజేపీ అగ్రనేతలు మరిచిపోలేదన్నారు. ఈ విషయాన్ని టీడీపీ మేనిఫెస్టో విడుదల సమయంలో బీజేపీ ప్రతినిధి సిద్ధార్థ్ సింగ్ హావభావాలు చూస్తే ఎవరైనా గ్రహిస్తారన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల సీఎం హోదాలో పేదల కోసం ఒక్క పైసా అందజేసిన సంఘటన లేదన్నారు. ఎంతసేపూ దోచుకోవడం , పంచుకోవడం, దాచుకోవడం తప్పిస్తే.. పేదల సంక్షేమం, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక్క పథకాన్ని కూడా సమర్థంగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ప్రజా రంజక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు రాబోయే ఎన్నికల్లో మళ్లీ పట్టం కడతారని అన్నారు. సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

జగన్‌తోనే ఎస్సీల అభ్యున్నతి

- డీబీటీ నాన్ డీబీటీ ద్వారా ఎస్సీలకు రూ.70 వేల కోట్లు
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనా రాజు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఎస్సీల అభ్యున్నతి సాధ్యపడుతుందని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనా రాజు ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం చేరుకున్న యోనా రాజు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పేద,బడుగు, బలహీన వర్గాలకు రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ నాన్ డీబీటీ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిచారని, వారిలో ఎస్సీలకు రూ.70 వేల కోట్లు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎస్సీలకు చేసిన సహాయాన్ని రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో, అన్ని నియోజకవర్గాలకు, పల్లెలకు వెళ్లి కరపత్రాలను పంచుతూ ఎస్సీలంతా జగన్ వెంట ఉన్నారని తెలియజేస్తున్నామన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను కొత్త జిల్లాలుగా మార్చినప్పుడు కోనసీమ జిల్లాకు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరును అడగకుండానే పెట్టి, మా గౌరవం కాపాడినందుకు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. ఎస్సీలపై అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న కేసులను ఎత్తివేసారని, పేదలకు అమరావతి రాజధానిలో 52,000 వేల ఇళ్ల స్థలాల పట్టాలిస్తే కోర్టులో కేసు వేసి చంద్రబాబు అడ్డుకున్నారని అన్నారు. నాడు – నేడు ద్వారా గవర్నమెంట్ స్కూల్స్ రూపురేఖలు మార్చినందుకు మేము జగన్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రూరల్, సిటీ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థులు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, మార్గాని భరత్‌రామ్, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్సీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా మహానాడు యూత్ ఇన్‌చార్జి బండి రాహుల్ , పశ్చిమ గోదావరి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు గొల్ల కిరణ్, నాయకులు బండి ప్రదీప్‌రాజు, దాసరి అనిల్, కొమరపు క్రాంతి, బందెల సువర్ణరాజు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యోనా రాజు

చంద్రబాబుపై 'చార్జిషీట్'

పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోపై కూటమిలో భాగస్వామి అయిన బీజేపీ ఎందుకు వ్యతిరేకత వ్యక్తం చేసిందో చంద్రబాబు సమాధానం చెప్పాలని రాజమండ్రి ఎంపీ, సిటీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో గల ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు 'ఫ్రీ ఫ్రీ' హామీలు అమలులో సాధ్యం కాదని తెలిసే బీజేపీ ఇబ్బంది పడుతోందన్నారు. చంద్రబాబు హామీలను ప్రజలు విశ్వసించరనే విషయాన్ని బీజేపీ అగ్రనేతల మనోభావాలు చెప్పకనే చెబుతున్నాయన్నారు. టీడీపీ మేనిఫెస్టోను కూటమిలో బీజేపీ సమర్థిస్తోందా లేదా అనేది బీజేపీ అగ్రనేతలే ప్రకటించాలన్నారు. గత 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలలో ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని, ఇప్పుడు 2024లో అంతకుమించిన హామీలతో ప్రజలను నమ్మించి వంచించడానికి చంద్రబాబు యత్నిస్తున్నారు. ఈ వంచనను వివరిస్తూ చార్జిషీట్ పోస్టర్ విడుదల చేస్తున్నామని ఎంపీ భరత్ తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఎంపీ భరత్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు పోలు విజయలక్ష్మి, నక్కా శ్రీనగేష్, పాలిక శ్రీను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్ తదితరులు

క్లుప్తంగా

ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్ల తనిఖీ


ఆసుపత్రిలో అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి బృందం

కాకినాడ క్రైం: కాకినాడలోని పలు ఆసుపత్రుల్లో అగ్నిమాపక పరికరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో డీఐవో రత్నకుమార్, ఎస్‌వో విజయలక్ష్మి పర్యవేక్షణలో మూడు రోజుల పాటు నిర్వహించారు. సంజీవని, రవిచంద్ర, బృందావనం, రాఘవ 24, గౌతమి, రమ్య, అరుణ హాస్పిటల్, బెస్ట్ ఆసుపత్రులలో ఈ తనిఖీలు చేసినట్లు విజయలక్ష్మి తెలిపారు. సహాయ గణాంకాల అధికారి వీఎస్ వర్మ, ఉప గణాంకాధికారి గిరి గణేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. అనకాపల్లి జిల్లా గుల్లిపాడు - నర్సీపట్నం మధ్యలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఒక వ్యక్తి (సుమారు 35 ఏళ్లు) మృతి చెందాడు. అతడి ఒంటిపై ఎరుపు రంగు కట్ బనియన్, కాఫీ పొడి రంగు ఫుల్ ప్యాంట్ ఉన్నాయి. అలాగే ఉప్పాడ రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో సుమారు 22 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. గ్రీన్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, జీన్ ప్యాంట్ ధరించాడు. రెండు కేసుల్లో మృతుల వివరాలు తెలియలేదని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

అమలాపురం రూరల్: దుకాణాలు, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికి వీలుగా పోలింగ్ జరిగే ఈ నెల 13వ తేదీని సెలవు దినంగా ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్, కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని కోనసీమ జిల్లా సహాయ కార్మిక కమిషనర్ టి.నాగలక్ష్మి తెలిపారు. అన్ని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు తమ ఉద్యోగులకు సెలవు ఇవ్వాలన్నారు. కార్మికులు వేతనాల్లో ఈ సెలవుకు సంబంధించి ఎటువంటి తగ్గింపు చేయరాదన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్మార్ట్ ఫోన్లకూ సన్‌స్ట్రోక్



- ఎండ తగిలితే నష్టమే
- వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం

కాకినాడ సిటీ: వేసవి నేపథ్యంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పది గంటలు దాటితే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం ఐదు గంటల వరకూ ఎండ తీవ్రత తగ్గడం లేదు. అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవడానికి మనం అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అయితే మనం వాడే ఎలక్ట్రానిక్స్ పరికరాల సంగతి ఏమిటి. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలకు కూడా ఎండ వల్ల నష్టం జరుగుతుంది. వాటిని కూడా ఎండ నుంచి కాపాడుకోవడం చాలా అవసరం. భానుడి కిరణాలు ఎలక్ట్రానిక్ వస్తువులను పూర్తిగా నష్టపరుస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ సమయం ఎండలో ప్రయాణం చేసేవారి స్మార్ట్ ఫోన్లలో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, **వాటి విషయంలో** జాగ్రత్తలు తీసుకోవాలని చెబు**తున్నారు.**

ఎండలో ఉంటే చేటు

స్మార్ట్ ఫోన్‌ను ఎక్కడైనా, ఎలాగైనా ఉపయోగించవచ్చు అనుకోవడం పొరపాటే. తక్కువ ఉష్ణోగ్రతలనే ఎలక్ట్రానిక్ పరికరాలు భరిస్తాయి. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేవు. సాధారణంగా ఫోన్‌ను ఎక్కువగా వాడితే వేడెక్కిపోతుంది. ఇక వేసవి ఎండ వాటిపై పడితే మరింత చేటు కలుగుతుంది. ముఖ్యంగా బ్యాటరీపై ప్రభావం పడుతుంది. స్క్రీన్‌పై పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. ఫోన్‌లోని ప్రాసెసర్లు వేడిని తట్టుకోలేవు. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు వాటి పనితనం తగ్గిపోతుంది. ఆ సమయంలో ఎక్కువ బ్యాటరీ శక్తి ఖర్చవుతుంది. బయటి ఎండలకే తట్టుకోలేకపోతున్న సమయంలో స్మార్ట్ ఫోన్లను ఎక్కువ సమయం బిగుతైన జేబులలో దాచుకోవడం తగదు.

వేడి ఎక్కువైతే..

- స్మార్ట్ ఫోన్లపై ఎక్కువ సేపు ఎండ పడితే స్క్రీన్‌పై ఉండే సన్నని ద్రవ పొరలు కరుగుతాయి. దాని వల్ల ఫిక్సల్ దెబ్బతిని అద్దంపై పగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది.
- ల్యాబ్‌టాప్, ట్యాబ్లెట్లు, స్మార్ట్ ఫోన్లను తప్పనిసరిగా నీడలో ఉండి ఉపయోగించాలి. వాటిని చేతిలో పట్టుకోవడం, వాహనంపై ఉంచడం తగదు.
- బ్లూటూత్ లొకేషన్ సర్వీసెస్, జీపీఎస్, వైఫై వంటి అంతర్గతంగా పనిచేసే అప్లికేషన్లను బంద్ చేయాలి.
- అనవసర సమయాల్లో స్మార్ట్ ఫోన్లను ఏరోప్లేన్ మోడ్‌లో పెట్టడం ఉత్తమం. దానివల్ల కొంత వరకు ఫోన్ చల్లబడే అవకాశం ఉంది.
- అపరిమితంగా ఫోన్ వేడెక్కినట్లు ఫోన్‌లో హెచ్చరిక వస్తే వెంటనే దాని బ్యాటరీని వేరు చేయాలి. లేకపోతే పూర్తిగా బంద్ చేయాలి.
- ఎండలో నిలబడినప్పుడు, ప్రయాణిస్తున్నప్పుడు గ్రాఫిక్స్‌తో కూడిన ఆటలు, జీపీఎస్ ద్వారా సూచికలు తీసుకోవడం, అంతర్జాలాన్ని ఉపయోగించడం చేయకూడదు. దాని వల్ల ప్రాసెసర్‌లో వేడి పెరిగి ఫోన్ పాడైపోతుంది.
- ఎలక్ట్రానిక్ పరికరాలను ఎండలో నిలిపిన కారులో వదిలేసి వెళ్లకూడదు. వెంట తీసుకెళ్లడం మంచిది.
- సెల్‌ఫోన్ ఏరోప్లేన్ మోడ్‌లో ఉంచినా, పూర్తిగా బంద్ చేసినా ఎక్కువ వేడితో ఉన్నప్పుడు మాత్రం చార్జింగ్ చేయకూడదు. అప్పటికే వేడిగా ఉండే బ్యాటరీ అదనంగా తోడయ్యే ఉష్ణాన్ని భరించలేక పాడైపోతుంది.

6,7 తేదీలలో క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఈ నెల 6, 7 తేదీలలో అండర్ 19, 23, సీనియర్ విభాగాల్లో క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి పసుపులేటి సత్యనారాయణ బుధవారం తెలిపారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుంచి ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. అండర్ 19 విభాగంలో 2005 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి కల క్రీడాకారులు తెల్ల దుస్తులు, తెల్ల బూట్లు, జనన ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని కోరారు.

6 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. కాకినాడ జిల్లాకు ఆర్ ఎంసీలోనూ, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఆర్ట్స్ కళాశాలలో బాలురకు, సీజీటీఎం స్కూల్‌లో బాలికలకు, పెద్దాపురంలోని శ్రీ ప్రకాశ్ స్కూలు, అమలాపురం పరిధిలో అంబాజీపేట జెడ్పీ స్కూల్లో శిక్షణా శిబిరాలు జరుగుతాయన్నారు. తొమ్మిదేళ్ల నుంచి, ఆపై వయసున్న వారు అర్హులన్నారు.

కత్తిమండ ప్రతాప్‌కు కన్నడ పురస్కారం



సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరక గ్రామానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కన్నడ సాహిత్య సంస్థల ఆధ్వర్యంలోని కవి సామ్రాట్ బిరుదుకు ఎంపికయ్యారు. ఈ మేరకు కన్నడ కవి (కథాబిదు ప్రకాశాన పబ్లిషర్స్, కన్నడ) పీవీ ప్రదీప్ కుమార్ నుంచి ఆయన సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని ప్రతాప్ బుధవారం విలేకరులకు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక టీం ద్వారా తెలుగు, కన్నడ భాషల్లో అందిస్తున్న విశిష్ట సాహిత్య సేవలు, అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న సాహిత్య సేవలకు గుర్తింపుగా ద్విభాషా శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా కన్నడ సాహిత్య సంస్థలు ఈ పురస్కారానికి తనను ఎంపిక చేశాయన్నారు. హైదరాబాద్‌లోని కర్ణాటక సాహిత్య మందిరంలో ఈ నెల 5వ తేదీన శ్రీశ్రీ కళావేదిక టీం ఆధ్వర్యాన తెలుగు, కన్నడ కవితా గోష్టిలో కవి సామ్రాట్ బిరుదును అందుకోనున్నట్టు తెలిపారు.

ఎన్నికల పోలింగ్‌లో ఏజెంట్లే కీలకం

- దొంగ ఓటర్లను గుర్తించే అవకాశం
- వివిధ రాజకీయ పార్టీల తరఫున నియామకం

కాకినాడ సిటీ: ఎన్నికల్లో పోలింగ్‌లో ఏజెంట్లదే కీలకపాత్ర. పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లందరూ ఒక్కటైపోతే దొంగ ఓటర్లు సులువుగా వేసుకునే అవకాశం ఉంది. అందుకే వివిధ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు పోలింగ్ కేంద్రంలో తమ తరఫున పనిచేసే ఏజెంట్ల విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటారు. ఎవరైతే పార్టీకి విధేయులుగా ఉంటారో వారినే నియమిస్తారు. దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడం, ఒకవేళ దొంగ ఓటు వేయడానికి ఎవరైనా వస్తే వారిని గుర్తించి పోలింగ్ అధికారులకు తెలియజేయడం వంటివి చేస్తుంటారు. ఓటర్లను పోలింగ్ ఏజెంట్లు గుర్తించిన తరువాతే ఓటు వేసేందుకు పోలింగ్ సిబ్బంది అనుమతిస్తారు. వాస్తవంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ఇందుకు ముందస్తుగా వారి వివరాలను ఎన్నికల అధికారులకు అందజేయాలి. ఆ తర్వాత ఎన్నికల అధికారి ఫొటో గుర్తింపు కార్డు ఇస్తారు. గతంలో ఎన్నికల అధికారులు ఫొటోలు లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసేవారు. ఒకరి తరఫున మరొకరు ఏజెంట్లుగా వ్యవహరించే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారులు ఫొటో గుర్తింపు కార్డులను ఇస్తున్నారు.

ఎవరు అర్హులంటే..

- పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి పోలింగ్ కేంద్రంలోగానీ ఆ పరిధిలో ఉండే గ్రామంలోగానీ ఓటరై ఉండాలి.
- ఓటు హక్కు లేని వారిని నియమించరు.
- పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చే వారిని గుర్తించేందుకు మాత్రమే ఏజెంట్లను నియమిస్తారు. అంతేకానీ వారికి ఎటువంటి అధికారాలు ఉండవు.
- పోలింగ్ ఏజెంట్‌గా ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఎటువంటి ప్రచారం చేయకూడదు.
- ఏదైనా పార్టీ తరఫున కేంద్రంలో ప్రచారం చేస్తున్నట్లు పోలింగ్ సిబ్బంది గమనిస్తే ముందుగా హెచ్చరించి తర్వాత బయటకు పంపిస్తారు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక అభ్యర్థికి ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమించుకునే వీలుంది.
- ఇద్దరు ఏజెంట్లు ఒకేసారి ఉండేందుకు అనుమతించరు.
- లోక్‌సభ అభ్యర్థి తరఫున ఇద్దరు, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి తరఫున ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమిస్తారు.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను చూడాల్సి ఉంది.

నియామకం ఇలా..

ప్రతి అభ్యర్థి తమకు నమ్మకమైన వారిని ఆధార్ కార్డు, మొబైల్ నెంబరుతో పాటు ఓటరు జాబితాలోని సీనియర్ నంబర్‌ను తీసుకొని ముందుగా పార్టీ కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత ఎన్నికల అధికారులకు ఆ జాబితా అందజేస్తారు. వారి పరిశీలన అనంతరం ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏ పోలింగ్ స్టేషన్‌లో ఏజెంట్‌గా వ్యవహరించాలి? అనే వివరాలతో గుర్తింపు కార్డును మంజూరు చేస్తారు. ఒక పోలింగ్‌స్టేషన్‌కు సంబంధించి గుర్తింపు కార్డు పొంది మరో కేంద్రంలో ఏజెంటుగా వ్యవహరించేందుకు అనుమతించరు.

విద్యా కానుక -5 ప్రణాళికపై సమీక్ష


ఎంఈవోలతో సమీక్షిస్తున్న డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్: జిల్లాలోని పాఠశాలల్లో విద్యా కానుక – 5 అమలు చేసేందుకు సిద్ధం చేసిన ప్రణాళికపై ఎంఈవోలు, జిల్లా విద్యాశాఖాధికారులతో బుధవారం డీఈవో ఎం.కమలకుమారి సమీక్షించారు. అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూలులో జరిగిన జిల్లా ఎంఈవోల సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ఆయా మండలాలకు సంబంధించి విద్యా కానుక మండల కమిటీల సభ్యులందరికీ ఇండెంట్ వివరాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. విద్యా కానుక వస్తువుల సరఫరా సందర్భంగా స్టాక్ రిసీవింగ్ కమిటీలు డెలివరీ చలానా విధిగా తీసుకోవాలన్నారు. సరఫరాకు వచ్చిన వెహికల్ డ్రైవర్ పేరు, ఫోన్ నెంబరు, వెహికల్ నెంబర్ రికార్డు చేసుకోవాలన్నారు. విద్యా కానుక యాప్‌లోని డాష్ బోర్డులో సరఫరా అయిన వస్తువుల వివరాలను తెలియపరచాలని, ఎంఈవో లాగిన్‌లో వస్తువుల వివరాలను డిస్‌ప్లే చేయాలని సూచించారు. సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో విద్యా కానుక -5 ప్రణాళిక అమలుకు వివిధ దశలలో విద్యాశాఖాధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే పూర్తిస్థాయి ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో ఏఎంవో పిల్లి రాంబాబు, ఏపీవో డాక్టర్ ఎంఈకే భీమారావు, ఏఐఎస్‌సీ డి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

రూ.4.27 లక్షల నిషేధిత సిగరెట్లు స్వాధీనం


నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్న దుకాణంపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడి చేశారు. రాజమహేంద్రవరం కేవీస్వామి రోడ్డులోని మీనాలక్ష్మీ ఫ్యాన్సీ జనరల్ గూడ్స్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, లీగల్ మెట్రోలజీ, కమర్షియల్ టాక్స్ అధికారులు తనిఖీలు చేశారు. దుకాణంలో ఈఎస్‌ఎస్‌ఈ ప్రత్యేక బంగారం, ఈఎస్‌ఎస్‌ఈ లైట్, డేవిడ్ ఆఫ్ గోల్డ్, డహిల్, డబుల్ హ్యాపీనెస్, మాండ్ గ్రీన్ యాపిల్, మోండ్ స్ట్రాబెర్రీ, లువిన్ చెర్రీ, లువిన్ గ్రేప్, లువిన్ వెనిలా తదితర నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించారు. రూ.4,27,240 విలువైన 1,551 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని సలాది శ్రీనివాసరావు, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేసి మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను చెన్నైలో కొనుగోలు చేసినట్టు దుకాణ యజమాని అధికారులకు తెలిపాడు. అలాగే దుకాణంలో స్టాక్‌కు సంబంధించిన ఖాతాల పుస్తకాలు, కొనుగోలు, అమ్మకాల బిల్లులను నిర్వహించడం లేదని అధికారులు గుర్తించారు. తనిఖీల్లో డీఎస్పీ పి.ముత్యాలు నాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, భార్గవ మహేష్, నవీన్, రాజమండ్రి కమర్షియల్ టాక్స్ అధికారి కృష్ణ తాతాజీ, జీవానందం, లోవరాజు, వలీ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపై నిరంతర నిఘా

- సరఫరా వాహనాలకు జీపీఎస్
- కంట్రోలు రూమ్‌లతో పూర్తి పర్యవేక్షణ
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్


ముమ్మిడివరంలోని ప్రభుత్వ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: ఎన్నికల సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ లిక్కర్ గోడౌన్, మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా మద్యం అమ్మకాలు, సరఫరా, పారదర్శకంగా జరిగేందుకు పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. ఎన్నికల్లో మద్యం సరఫరాను నిశితంగా పరిశీలిస్తూ కంట్రోలు రూమ్‌ల ఏర్పాటు ద్వారా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో పలు ప్రభుత్వ మద్యం దుకాణాలను బుధవారం పరిశీలించి, రికార్డులను ఆద్యంతం తనిఖీ చేశారు. డిస్టలరీ నుంచి డిపోకు, డిపో నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు, బార్ అండ్ రెస్టారెంట్లకు మద్యంతో వెళ్లే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేశారని, దాని ద్వారా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌తో పాటు విజయవాడలోని తమ శాఖ కమిషనర్ కార్యాలయంలోని కంట్రోలు రూమ్‌కు అనుసంధానం ఉందన్నారు. అమలాపురంలోని లిక్కర్ గోడౌన్, ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను సీసీ కెమెరాలతో వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ చేస్తుందన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్), డ్యూటీ పెయిడ్ లిక్కర్ (డీపీఎల్) నిల్వలపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమ మద్యం, ఇతర మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ 91210 71233, 78939 92996 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. సమాచారం అందించిన వారి పేరు, చిరునామా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

అక్రమ మద్యం కేసుల్లో 12 మంది అరెస్ట్


ముక్కామల చెక్‌పోస్టును తనిఖీ చేసి, పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ, ఎస్‌ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ నిఘా బృందాలు బుధవారం అక్రమ మద్యం నిల్వలకు సంబంధించి 12 కేసులు నమోదు చేసి, 12 మందిని అరెస్ట్ చేశాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా దాడులు, తనిఖీలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈ దాడుల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం బుధవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనతో వివరించింది.

- జిల్లాలో నమోదైన 12 కేసులకు సంబంధించి అరెస్ట్ అయిన 12 మంది వ్యక్తుల నుంచి 6 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 130 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 29.61 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- రావులపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.23,100 సీజ్ చేశారు.
- అంబాజీపేట మండలం ముక్కామల సెంటర్‌లో ఏర్పాటైన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టును జిల్లా పోలీసు అబ్జర్వర్ ఎంపీ చంద్రకాంత్ తనిఖీ చేశారు.
- పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్సైలతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన అదనపు భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

జీజీహెచ్‌లో మత్తు ఇంజెక్షన్ల చోరీ

- నర్సు అప్రమత్తంగా ఉండడంతో పట్టుబడిన దొంగ
- మాదక ద్రవ్యాల బానిసగా నిర్ధారణ


మత్తు ఇంజెక్షన్లు దొంగిలిస్తూ పట్టుబడిన వ్యక్తి

కాకినాడ క్రైం: మాదక ద్రవ్యాలకు బానిసైన ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో హల్‌చల్ చేశాడు. జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డు నుంచి మంగళవారం సాయంత్రం మత్తు కలిగించే యాంటీహిస్టమైన్ రకానికి చెందిన ఫినిరమైన్ మేలియేట్ 22.5 ఎంజీ/ఎంఎల్ ఇంజెక్షన్లను ఎత్తుకెళుతుండగా విధుల్లో ఉన్న నర్సు పట్టుకున్నారు. వెంటనే ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు అవుట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. నగరానికి చెందిన ఈ 40 ఏళ్ల ఈ వ్యక్తి మాదక ద్రవ్యాలకు బానిసయ్యాడు. ఏవీల్ పేరుతో మార్కెట్‌లో లభ్యమవుతున్న ఫినిరమైన్ ఇంజెక్షన్లను కొనుగోలు చేసి, తనకు తానుగా చేసుకుంటూ మత్తులో తూగేవాడు. అయితే వీటికి వైద్యుడి ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి. దీంతో బహిరంగ మార్కెట్‌లో లభ్యం కావడం కష్టతరమైంది. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో వార్డులపై కన్నుపడింది. వార్డుల్లో కొన్ని రకాల మందులకు ఎటువంటి భద్రత లేకపోవడం ఈ వ్యక్తికి కలిసొచ్చింది. దీంతో ఆసుపత్రిలో కొన్నాళ్లుగా పలు వార్డుల నుంచి ఈ ఇంజెక్షన్లను దొంగతనం చేసేవాడు. ఎట్టకేలకు క్యాన్సర్ వార్డులో నర్సు అప్రమత్తంగా వ్యవహరించడంతో పట్టుబడి పోలీసులకు చిక్కాడు. చానాళ్లుగా జీజీహెచ్‌లో ఇలా ఇంజెక్షన్లను చోరీ చేస్తున్నట్టు పోలీసులకు చెప్పాడు. వివిధ కోణాల్లో విచారించిన పోలీసులు ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలులో లేదు

- రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్ష కూటమి దుష్ప్రచారం
- వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి త్రినాథరెడ్డి


కొవ్వూరి త్రినాథరెడ్డి

రాయవరం: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, కేవలం ప్రతిపక్ష కూటమి నాయకులు రాజకీయ దురుద్దేశంతో దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి అన్నారు. రాయవరం మండలం సోమేశ్వరంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను 1989 నుంచి అమలు చేసేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో దీనిని అమలు చేయాలంటూ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కూడా ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అమలు చేయడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాష్ట్రంపై కూడా ఒత్తిడి తీసుకుని వస్తున్నప్పటికీ, నిరంతరం రైతుల సంక్షేమాన్ని కాంక్షించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించలేదన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కూడా పత్రికాముఖంగా స్పష్టం చేసిన విషయాన్ని త్రినాథరెడ్డి గుర్తు చేశారు.

ఆదరణ చూసి ఓర్వలేకే..

త్రినాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి బెంబేలెత్తిపోతున్న ప్రతిపక్ష పార్టీ నేతలు కేవలం బురద చల్లే ప్రయత్నాల్లో భాగంగానే అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు. దీనిని అమలు చేయని విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు అఫిడవిట్ సమర్పించిందన్నారు. ప్రస్తుతం ఈ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కెప్ట్ ఇన్ పెండింగ్‌లో పెట్టిందన్నారు. కార్డు-2 వెర్షన్ అప్‌డేషన్‌లో భాగంగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఒక మెమోను జారీ చేసిందన్నారు. దాని ప్రకారం 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 135 డాక్యుమెంట్లను ఒక డమ్మీ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రయోగాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారన్నారు. దీని అమల్లో లోపాలను తెలుసుకునేందుకు కేవలం డమ్మీ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి పర్చారన్నారు. దీన్ని కూడా ప్రతిపక్ష నాయకులు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు ముడిపెట్టి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. దీనిపై ఫేక్ వీడియోలు సృష్టించి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారన్నారు. రైతులు ఈ విషయాలను గమనించాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రాలకు వెల్లడించినట్లుగా కొద్ది రోజుల క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. మన రాష్ట్రంలో ఈ చట్టం అమల్లోకి రాలేదని పురందేశ్వరి వెల్లడించిన విషయాన్ని అన్నదాతలు గమనించాలని సూచించారు.